రూ.120 కోట్ల పన్ను వసూళ్లే లక్ష్యం

కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ



కుత్బుల్లాపూర్ : ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అన్నారు. సర్కిల్ పరిధిలో మొత్తం రూ.120 కోట్ల మేర 2025 మార్చి 31 వరకు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని, అందుకు బిల్ కలెక్టర్ల వారీగా వసూళ్ల ప్రక్రియ చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికీ రూ.43.63 కోట్లు వసూలయ్యాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ బిల్ కలెక్టర్లకు సహకరించి పన్నులు చెల్లించాలని కోరారు. వందమంది మొండి బకాయిదారుల జాబితా తయారు చేశామని, ఇప్పటికే రెడ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్ విషయంలో సైతం చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

నిజాంపేట్: విజ్ఞాన జ్యోతి పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం శంకర కంటి ఫౌండేషన్ వారు ఫీనిక్స్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న శిబిరంలో 200 మంది విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి సంస్థ ప్రధాన కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, పాఠశాల చైర్‌పర్సన్ కృష్ణప్రసాద్, విజ్ఞాన జ్యోతి సభ్యుడు బి.తారాచంద్, ఫీనిక్స్ ఫౌండేషన్ ట్రస్టీలు చుక్కపల్లి ఆకాశ్, చుక్కపల్లి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభించిన డీసీపీ



వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్: ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వార ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభించి మాట్లాడారు. వేసవి నేపథ్యంలో స్టేషన్‌కు వివిధ ఫిర్యాదుల నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట : విద్యుత్ మరమ్మతుల కారణంగా జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీలలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాధాకిషన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు జగద్గిరిగుట్ట, బీరప్ప నగర్, అంజయ్య నగర్, మైసమ్మ నగర్, సోమయ్య నగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నిజాంపేట్: 33/11కేవీ మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ ఫీడర్‌లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు లక్ష్మీనగర్, కేంద్రీయ విహార్ రోడ్డు, మయూరి నగర్, రత్నదీప్ వెనుక భాగం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఆయాన్‌ఖాన్(ఫైల్)

కుత్బుల్లాపూర్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 9.30 గంటలకు జీడిమెట్ల డివిజన్ ఉడ్స్ కాలనీలోని ఓ నిర్మాణంలో ఉన్న భవనం నాలుగవ అంతస్తులో ఆయాన్‌ఖాన్(22) ప్లంబింగ్ పనులు చేస్తున్నాడు. డ్రిల్లింగ్ మిషిన్ వైరు తాకడంతో అయాన్‌ఖాన్‌కు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కన్‌స్ట్రక్షన్ సైట్ సూపర్‌వైజర్ పనుల సమయంలో రక్షణ చర్యలు తీసుకోకపోవడంతోనే మృతి చెందాడని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉక్కిరి బిక్కిరి

ఎలీప్ పారిశ్రామిక వాడ నుంచి వెదజల్లుతున్న విష వాయువులు

- నాటి బ్రాండ్ కోల్పోతున్న ప్రగతి నగర్
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

నిజాంపేట్: ఒకప్పుడు ప్రగతినగర్ అంటే వచ్చని చెట్లతో ఆహ్లాద వాతావరణానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. దీంతో ఇక్కడ నివాసం ఉండేందుకు ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపించేవారు. ప్లాస్టిక్ కవర్లు, పొగాకు ఉత్పత్తులు, శీతల పానియాలతో పాటు మద్యం అమ్మకాలు సైతం ఇక్కడ నిషేధం. దీంతో ప్రగతినగర్ తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పాటు చేసుకొని రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామంగా ఎంపికైంది. కానీ నేడు అదే ప్రగతినగర్ విషవాయువులతో తల్లడిల్లుతోంది. రోజు రోజుకు నాటి తన స్వరూపాన్ని కోల్పోతుంది. వచ్చని చెట్లతో ఆహ్లాద వాతావరణానికి కేరాఫ్‌గా నిలిచిన ప్రగతినగర్ నేడు కాలుష్య వాతావరణానికి కేరాఫ్‌గా మారింది. దీనికి కారణం ప్రగతినగర్‌లోని ఎలీప్ పారిశ్రామిక వాడలో ఉన్న కొన్ని పరిశ్రమల నుంచి ప్రతినిత్యం వచ్చే విష వాయువులు. పలు మార్లు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి అయితే చాలు..

ఎలీప్ పారిశ్రామిక వాడలో నుంచి వెలువడుతున్న విష వాయువులతో ప్రగతినగర్‌తో పాటు పరిసర ప్రాంత కాలనీలు, బస్తీలైన సాయినగర్, ప్రగతినగర్, దిగువ భాగాన దేవేందర్‌నగర్, కైసర్‌నగర్, గాజులరామారం, బాలయ్యనగర్, మహాదేవపురం ప్రాంతాల్లో విష వాయువల ప్రభావం ఉన్నది. దేవేందర్ నగర్ పరిసర ప్రాంతాల్లో కొన్ని బోర్లలో రంగుతో, వాసనతో కూడిన నీరు సైతం వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా రాత్రి సమయాల్లోనే ఈ విష వాయువులను వదులుతుండటంతో వాయు కాలుష్యంతో పాటు జల కాలుష్యం సైతం అవుతుంది.



పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేస్తున్న ప్రజలు (ఫైల్)

నాడు నిషేధం.. నేడుగా జోరుగా అమ్మకాలు

ప్రస్తుతం ప్రగతినగర్‌లో పొగాకు ఉత్పత్తులు, మద్యం అమ్మకాలు సైతం జోరుగా సాగుతున్నాయి. శీతల పానియాల విక్రయంతో పాటు ప్లాస్టిక్ కవర్ల వినియోగం జరుగుతున్నాయి. నాడు పర్యావరణానికి హాని కలిగించే వాటితో పాటు, ఆరోగ్యానికి హాని కలిగించే వాటిపై నిషేధం ఉండేది. నేడు మాత్రం అన్ని అమలులో ఉండటంతో పాటు విషవాయువులతో పాటు వ్యర్థ రసాయనాలు సైతం విచ్చల విడిగా వదులుతూ ప్రగతినగర్‌లోని పర్యావరణం కలుషితమవుతుంది.

బోర్లలో రంగు నీళ్లు వస్తున్నాయి



ఒకప్పుడు వేసవి కాలంలో సైతం స్వచ్ఛమైన నీరు వచ్చేది. ఎలీప్ ఇండస్ట్రీస్ పరిశ్రమతో దేవేందర్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. స్థానికంగా కొన్ని బోర్లలో నుంచి ఘాటైన వాసనలతో కూడిన రంగు నీళ్లు వస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి సదరు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి.

– రాఘవేందర్‌గౌడ్, శంకరయ్య భవాని ఎన్‌క్లేవ్ ప్రెసిడెంట్, దేవేందర్‌నగర్

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



ప్రతి రోజూ తెల్లవారు జామున, అర్ధరాత్రి కెమికల్ వ్యర్థాలను వదులుతున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గతంలో ప్రజా ప్రతినిధులకు సైతం సమస్యను వివరించాము. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కెమికల్ వ్యర్థాలను బయటకి వదలకుండ చర్యలు తీసుకోవాలి.

– నవీన్, ప్రగతినగర్

కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల నిరసన

కుత్బుల్లాపూర్: పెట్టుబడిదారులకు లాభాలు గ్యారంటీ చేసి, పేద, మధ్యతరగతి ప్రజలను లూటీ చేయడమే కేంద్ర బడ్జెట్ లక్ష్యమని వామపక్ష నేతలు అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బుధవారం షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శులు కీలుకానీ లక్ష్మణ్, ఉమా మహేష్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌తో సామాజిక సేవలు, పేదలు, నిరుద్యోగ యువత, రైతాంగం, వ్యవసాయ కూలీలకు ఒరిగేదేమీ లేదన్నారు. ప్రజలను ఓటు బ్యాంకుగా పరిగణించి, ఓట్లు రాల్చుకోవడానికి బడ్జెట్‌ను ఉపయోగించుకునేలా రూపొందించారన్నారు. దేశంలో కనీసం మూడోవంతు శ్రామికులకు ఉపాధి కల్పిస్తున్న చిన్న తరహా పరిశ్రమలు అనేక ఇబ్బందులకు గురవుతుంటే బడ్జెట్‌లో వాటి ఊసే లేదన్నారు. కార్పొరేట్ పన్నులు పెంచాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర హామీ కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50 శాతం కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవదానం, అంజయ్య, స్వామి, నరసింహారెడ్డి, జార్జ్, సుంకిరెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.



షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

3 నుంచి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలను మార్చి 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. 3వ తేదీన అధ్యయనోత్సవాలు, 4న 5.30 గంటలకు పరమపదోత్సవం, బ్రహ్మోత్సవం ప్రారంభం, రాత్రి 8 గంటలకు బోడుప్పల్‌కు చెందిన వైవీఎస్ పార్థసారథి బృందం సభ్యుల అన్నమయ్య స్వరార్చన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 5న సాయంత్రం 6 గంటలకు పెద్ద శేషవాహనసేవ, 8 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన, 6న విశేష అలంకరణ, ఉదయం 11 గంటలకు వెంకటాచల మహత్యంపై విశేష ప్రవచనం, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, 7న ఉదయం 7 గంటలకు ఆదిత్య హృదయం, సంక్షిప్త రామాయణ హవనాలు, రాత్రి 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై స్వామివారికి పల్లకీ సేవ, 7.30 గంటలకు సామూహిక కుంకుమార్చనలు. 8న 108 కలశాలతో శ్రీవారికి అభిషేకం, రాత్రి 7 గంటలకు దేవతోద్వాసన, ద్వాదశారాధన, సప్తావరణం, శ్రీపుష్పయాగం, ధ్వజారోహణం, స్వామివారి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.



ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

జయంతి సందర్భంగా ఘన నివాళి

కుత్బుల్లాపూర్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైందవ సంస్కృతిని పరిరక్షించడంలో శివాజీ మహరాజ్ చేసిన సేవలను వక్తలు కొనియాడారు. నేటి యువతి ఆయన్ని స్ఫూరిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు.



జీడిమెట్ల డివిజన్ హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



శ్రీరామ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ఎస్ఎల్‌బీనగర్‌లో కొట్టే సదానంద్, పత్తి సతీష్ తదితరులు



సుభాష్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో ..



కొంపల్లి పోచమ్మగడ్డ వద్ద జరిగిన వేడుకల్లో..

ఇక రెండో గేట్ ఓపెన్..

కుత్బుల్లాపూర్: జంట సర్కిల్‌ల కార్యాలయం ప్రధాన గేటు కొన్ని సంవత్సరాలుగా ఒక పక్క మూసి ఉంది. మరోపక్క తెరిచి ఉంది. ఒక వైపు నుంచే రావడం, వెళ్లడం ఉండటంతో అధికారులకు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు గేట్లు తెరిచేలా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వాస్తు విషయంలో కొంతమంది అధికారులు కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్కిల్ ఆవరణలో రెండు గేట్లు ఉండేవి. ఇటీవల జంక్షన్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రూ.1.30 కోట్లతో వెడల్పు కార్యక్రమం చేపట్టారు. సర్కిల్ కార్యాలయం ప్రధాన రోడ్డు ఇటీవల పూర్తి చేశారు. దానికి అనుగుణంగా ప్రహరీ సైతం తొలగించి కార్యాలయం లోపల రోడ్డు వేసి మూసి ఉన్న గేటును తెరిచేందుకు నిర్మాణ పనులు చేపట్టారు. ఒకవైపు నుంచి రావడం మరోవైపు నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు. ఏది ఏమైనా పదేళ్ల నుంచి మూసి ఉన్న గేటు తెరవడం విశేషం.



మూసి ఉన్న గేటు ప్రారంభించేందుకు కొనసాగుతున్న పనులు

మెట్రో కారిడార్ ఏర్పాటు చేయాలని వినతి

జగద్గిరిగుట్ట: జీడిమెట్ల, షాపూర్ నగర్, బొంతపల్లిలోని పరిశ్రమలకు వెళ్లే కార్మికులు తీవ్ర ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ రూట్‌లో మెట్రో కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. కూకట్‌పల్లి నుంచి బాలానగర్, చింతల్, షాపూర్ నగర్, సూరారం, గండిమైసమ్మ మీదుగా మెట్రో ఏర్పాటు చేస్తే కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి.. సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్, జాతీయ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు అమర్ బాబు, జాతీయ దళిత సేన అధ్యక్షులు జేమ్స్, జై భీమ్ సేన అధ్యక్షులు అంజన్న, దళిత ఐక్యవేదిక కన్వీనర్ అశోక్, కార్మిక నాయకుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటిన విద్యార్థులకు సన్మానం



తేజశ్రీ , ఖుషీ శర్మలను అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన బ్రిలియంట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు తేజశ్రీ, ఖుషీ శర్మ జాతీయ, అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటారు. ఇటీవల బిర్లా ప్లానిటోరియంలో కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఇంటర్నేషనల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ 2025' అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుధవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ వారిని సన్మానించారు. రానున్న రోజుల్లో ఉత్తమ ప్రతిభతో మరిన్ని అవార్డులు సాధించి తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బ్రిలియంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు దేవేందర్ గౌడ్, దుర్గారావు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ పోటీలు

జగద్గిరిగుట్ట: మగ్దూం నగర్ మండల పరిషత్ పాఠశాలలో బుధవారం హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. వారం రోజులుగా ఈ పాఠశాలలో జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతిరాత శిక్షణ నిర్వహించి బుధవారం పోటీలు నిర్వహించారు. 5వ తరగతికి చెందిన అంశు కుమారి, ప్రీతి, రిజ్వాన్‌లు ప్రతిభ చాటారు. వీరికి హెచ్ఎం కిషన్ బహుమతులు అందజేశారు. అనంతరం జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టర్ వంపు మల్లయ్యను సన్మానించారు. కార్యక్రమంలో హ్యాండ్ రైటింగ్ ట్రైనర్లు రజిత, రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అతిథులు, ఉపాధ్యాయులు

చెరువుల్లో మురుగు నీరు చేరకుండా చర్యలు



చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ ఉదయ్ భాస్కర్ తదితరులు

దుండిగల్: చెరువుల్లో మురుగునీరు చేరకుండా చర్యలు చేపడతామని ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ ఉదయ్‌భాస్కర్ అన్నారు. బుధవారం దుండిగల్ పరిధిలోని చిన్న దామరచెరువును ఆయన అసిస్టెంట్ ఇంజినీర్ స్వప్నతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నదామర చెరువు అలుగును పునరుద్ధరించడంతో పాటు సమీప కాలనీల నుంచి మురుగునీరు చెరువులోకి చేరకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావలి గణేష్, మాజీ కౌన్సిలర్ అమరం గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, మాజీ వార్డు సభ్యుడు పిట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు

జీడిమెట్ల: కువైట్‌లో ఉంటున్న కోళ్ల బత్తుల శివపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని శెట్టిబలిజ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జీడిమెట్ల సీఐకి ఫిర్యాదు చేశారు. శెట్టిబలిజ కమ్యూనిటీకి సంబంధించిన మహిళల గురించి అసభ్యంగా మాట్లాడుతూ శెట్టిబలిజ జాతిని కించపరిచే విధంగా వీడియోలు పోస్టు చేశారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ అధ్యక్షులు గుత్తుల మీరాకుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, ట్రెజరర్ పిల్లి నాగగోపాలకృష్ణ, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కొప్పిగుంట, గుబ్బల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న శెట్టిబలిజ సంఘం సభ్యులు

నీటి సమస్య నివారణకు నిరంతర పర్యవేక్షణ

శివారుల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

- వేసవిలో ప్రతిరోజూ మానిటరింగ్
- స్పెషల్ ఆఫీసర్ల నియామకం
- బోర్లు ,చేతిపంపుల మరమ్మతులు
- జీపీలు, పురపాలక సంఘాల్లో అదనపు వాటర్ ట్యాంకులు
- అవసరమైతే అద్దెకు తీసుకునేందుకు వ్యవసాయ బోర్ల గుర్తింపు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివార్లలోని 13 పురపాలక సంఘాలు , 34 గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించనున్నారు. ఓఆర్ఆర్ (లోపలి)పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి జలమండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తోంది.

3 డివిజన్లు / వార్డులకు ఒక ట్యాంకర్

నగర శివార్లలోని జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట నగరపాలక సంస్థలతో పాటు కొంపెల్లి, మేడ్చల్, దుండిగల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్కేసర్ మున్సిపాలిటీల పరిధిలోని 3 డివిజన్లు/ వార్డులకు ఒక వాటర్ ట్యాంకర్‌ను కేటాయించనున్నారు. అవసరాన్ని బట్టి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రైవేట్ కమర్షియల్ బోర్లతోపాటు పట్టణానికి సమీపంలో గుర్తించిన వ్యవసాయ బోర్లను కూడా ఉపయోగించుకునేలా కార్యాచరణ ఖరారు చేశారు. మంచి నీటి సరఫరా పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ గౌతమ్ పురపాలక సంఘాల కమిషనర్లతో సహా ప్రత్యేక అధికారులను నియమించారు. వీరందరూ జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)రాధికా గుప్తా నేతృత్వంలో పని చేయనున్నారు. ఎండలు అధికమవుతున్న నేపథ్యంలో పడిపోతున్న భూగర్భ జలాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్టుమెంట్లల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రైవేట్ కమర్షియల్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అధిక జనాభా కలిగి ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌తోసహా పురపాలక సంఘాల్లో మంచినీటి సమస్య తలెత్తకూడదన్న లక్ష్యంతో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం పేర్కొంది.

పంచాయతీల్లోనూ పకడ్బందీ చర్యలు

34 గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పంచాయతీల్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు, వాటర్ ట్యాంకర్లు ఉన్నా, ప్రతి గ్రామానికి అదనంగా రెండేసి చొప్పున వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచినట్లు జిల్లా పంచాయతీశాఖ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే జూన్ వరకు మంచినీటి ఎద్దడి నివారణకు ఏ,బీ,సీ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిన పంచాయతీ శాఖ అవసరాన్ని బట్టి అద్దెకు తీసుకునేందుకు పలు వ్యవసాయ బోర్లను గుర్తించినట్లు తెలిసిది. ఇందులో ఘట్కేసర్ మండలంలో 38, కీసరలో 12, ఎంసీపల్లిలో 32 , శామీర్‌పేటలో 45, మేడ్చల్ మండలంలో 42 వ్యవసాయ బోర్లు అద్దెకు తీసుకునేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ బోర్లు ఉన్న భూములు సర్వే నంబర్లతో సహా రైతుల ఫోన్ నంబర్లు తదితర వివరాలను జిల్లా అధికార యంత్రాంగం సేకరిస్తోంది.